

"ఎండుమిర్చి ధర దారుణంగా పడిపోతున్నది. సీజన్ ఆరంభంలో ఖమ్మం మార్కెట్‌లో జెండా పాట రూ.23,600 పలికిన క్వింటాల్ మిర్చి రూ.21 వేలకు దిగజారింది. దీంతో మిర్చిరైతుల సంతోషం వారంరోజులకే ఆవిరైపోతున్నది. పేరుకే గరిష్ఠ రేటు.. కానీ కొనేది రూ.15 నుంచి రూ.16 వేలకు మాత్రమే. అసలే ఈ ఏడాది దిగుబడి లేక దిగాలు చెందుతున్న రైతన్నలు ధరల పతనంతో మరింత కుంగిపోతున్నారు. అయితే ధరలు పడిపోవడానికి కారణం ఎగుమతులు లేకపోవడమా? వ్యాపారులు సిండికేట్‌గా మారడమా? అనేది అర్థంకావడం లేదు. వ్యాపారులే పంటను కొని నిల్వ పెట్టుకుంటున్నారనే ఆరోపణలు మాత్రం వినిపిస్తున్నాయి. ఏదేమైనా మార్కెట్‌కు తెచ్చిన మిర్చిపంటను తిరిగి ఇంటికి తీసుకెళ్తున్నారంటే రైతుల పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

**జెండాపాట క్వింటా ధర**

- 2వ తేదీ రూ.23,600
- 4వ తేదీ రూ.23,150
- 5వ తేదీ రూ.23,000
- 8వ తేదీ రూ.21,000

# మిర్చి ధర ధమాల్



ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు రైతులు తీసుకొచ్చిన మిర్చి బస్తాలు

- **రూ.23,600 నుంచి రూ.21 వేలకు పడిపోయిన గరిష్ఠ ధర**
- **రూ.15 నుంచి రూ.16వేలకే కొంటున్న ఖరీదుదారులు**
- **కొద్దిరోజులకే ఆవిరైన మిర్చిరైతుల సంతోషం**
- **తక్కువ ధరకు అమ్మలేక పంటను ఇంటికి తీసుకెళ్తున్న వైనం**
- **అటు దిగుబడి.. ఇటు రేటు లేక రైతన్న అయోమయం**
- **ధరల పతనానికి కారణం ఎగుమతులు లేకనా? సిండికేట్‌నా?**
- **వ్యాపారులే పంట నిల్వ చేస్తున్నట్లు ఆరోపణలు**

ఖమ్మం వ్యవసాయం, జనవరి 8 : ఎండుమిర్చి ధర రోజు రోజుకూ పతనమవుతుండడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గడిచిన వారంరోజుల క్రితం ఖమ్మం వ్యవసాయ మార్కెట్లో తేజారకం ఎండు మిర్చి ధర క్వింటాల్ రూ.23,600 పలుకగా, వారంరోజుల వ్యవధిలోనే జెండాపాటలో అదే రకం పంట రూ.21 వేలకు పడిపోయింది. రెండురోజుల సెలవుల అనంతరం సోమవారం నగర వ్యవసాయ మార్కెట్‌లోని మిర్చి యార్డుకు ఆయా జిల్లాల నుంచి రైతులు సుమారుగా 20 వేల మిర్చి బస్తాలను తీసుకొచ్చారు. గతవారం మంచి ధర పలకడంతో ఇదే అదునుగా భావించిన రైతులు పెద్దఎత్తున పంటను తీసుకొచ్చారు. ఏంజరిగిందో తెలియదుకానీ సోమవారం ఉదయం జరిగిన జెండాపాటలో గరిష్ఠ ధర క్వింటాల్ ఒకే ఒక్క లాట్‌కు రూ.21 వేలు పలికింది. మధ్య ధర క్వింటాల్ రూ.18,500 కాగా, కనిష్ఠ ధర క్వింటాల్ రూ.7 వేలు చొప్పున ఖరీదుదారులు పంటను కొనుగోలు చేశారు. యార్డుకు పంటను తీసుకొచ్చిన రైతుల్లో సుమారు 80శాతం మంది పంట క్వింటాల్ రూ.15 నుంచి రూ.16 వేలు మాత్రమే పలికింది.

దీంతో ఎన్నోఆశలతో పంటను యార్డుకు తీసుకొచ్చిన రైతులకు తీవ్ర నిరాశే మిగిలింది. ధర నచ్చకపోవడంతో కొందరు రైతులు తిరిగి ఇంటికి పంటను తీసుకుపోయారు. మరికొందరు చేసేది లేక ధర నచ్చకపోయినప్పటికీ తప్పనిసరి పరిస్థితిలో అమ్ముకున్నారు. కొద్దిమంది పంటను ఖరీదుదారులు కొనుగోలు చేయకపోవడంతో యార్డులోనే ఉంచుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా జిల్లావ్యాప్తంగా కోల్డ్‌స్టోరేజీలు సైతం ఖాళీ అయ్యాయి. దీంతో ఈ సంవత్సరం మిర్చిపంటకు మంచి ధర పలుకుతుందని ప్రతిఒక్కరూ భావించారు. అయితే సీజన్ ఆరంభంలోనే ఎర్రబంగారం ధర పతనం అవుతుండడంతో సాగు చేసిన రైతులు కన్నీరుమున్నీరు అవుతున్నారు. మిర్చిధరల తగ్గుదలకు కారణం ఎగుమతులు లేకనా? ఖరీదుదారులు సిండికేట్ దందాకు తెరలేపారా అన్నది తేలాల్సి ఉంది.

**ఎగుమతులు లేకనా? సిండికేటా?**

మార్కెట్లో ఇంత తక్కువ ధర పలకడానికి మార్కెట్ వర్గాలు ఒక్కొక్కరూ ఒక్కో కారణం చెబుతున్నారు. గడిచిన వారంలో పంట నాణ్యతతో సంబంధం లేకుండా ఇంతకంటే పచ్చిగా ఉన్నప్పటికీ ధర ఎందుకు పెట్టారని రైతులు వ్యాపారులను నిలదీశారు. ఎక్కువ మొత్తంలో పంట తీసుకొచ్చిన తరువాత ధర కావాలని తగ్గించారని రైతులు ఆరోపించారు. మొదటి నుంచి ధర తక్కువగా ఉంటే ఇంటిదగ్గరనే పెట్టుకొని నచ్చిన రేటు వచ్చిన తరువాత అమ్ముకునేవాళ్లమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే వ్యాపారులు మాత్రం మరో విధంగా సమాధానం ఇస్తున్నారు. విదేశాలకు పూర్తిగా ఎగుమతులు లేకపోవడంతో ఇక్కడి వ్యాపారులు మాత్రమే పంటను కొనుగోలు చేస్తున్నారని అంటున్నారు. రైతులు తీసిన పంటను తీసినట్టుగానే మార్కెట్‌కు తీసుకొస్తున్నారని వ్యాపారులు తెలిపారు. దీంతో పంట నాణ్యత పూర్తిగా తగ్గిపోవడం ద్వారా సైతం ధరలు తగ్గినట్లు చెబుతున్నారు. ఏదేమైనా వారంరోజుల వ్యవధిలోనే క్వింటాకు ఒక్కంటికి దాదాపుగా నాలుగు వేలు తగ్గడం పట్ల రైతులు తీవ్ర ఆవేదనలో ఉన్నారు. వ్యాపారులు సిండికేట్‌గా మారి పంటను కొనుగోలు చేసి నిల్వ పెట్టుకుంటారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒకవైపు పంటల దిగుబడి గణనీయంగా పడిపోవడం, మరోవైపు మిర్చి ధరలు పతనంకావడంతో మిర్చి రైతులు ఈ ఏడాది అప్పుల ఊబిలో కూరుకుపోవడం ఖాయంగా కనిపిస్తున్నది. సంక్రాంతి తర్వాత ఎగుమతులు ప్రారంభమైతే మిర్చి ధర పెరుగుతుందని రైతులు ఆశతో ఎదురుచూస్తున్నారు.

### రూ.15వేలకు అమ్మలేక ఇంటికి తీసుకెళ్తున్నా..



ఈ రోజు 12 మిర్చి బస్తాలను మార్కెట్‌కు తీసుకొచ్చాను. జెండాపాట తర్వాత నా పంటను వ్యాపారులు క్వింటా ఒక్కంటికి రూ.15 వేలకు అడిగారు. మా కమీషన్ వ్యాపారి ఎంత ప్రయత్నం చేసినా అంతకంటే ధర ఎక్కువ పెట్టలేదు. మొన్నటి ధరను చూసి పంట తీసుకొచ్చా. మరీ అంతతక్కువకు అడగడంతో తిరిగి ఇంటికి పంటను తీసుకెళ్తున్నాను. ఆరబెట్టి మళ్లీ ధర పెరిగిన తర్వాత తెస్తాను.

**– చేకూరి రామారావు, రైతు, మల్లుపల్లి, కొణిజర్ల**

### దిగుబడి లేదు.. రేటు లేదు



గతంలో ఎప్పుడు ఇలాంటి ఇబ్బంది పడలేదు. ఈ సంవత్సరం నా సొంతభూమి ఎకరంన్నరలో మిర్చితోట సాగు చేశాను. ఇప్పటివరకు కేవలం నాలుగు బస్తాలు మాత్రమే దిగుబడి వచ్చింది. మహా అయితే మరో రెండు బస్తాలు రావచ్చు. దాదాపు రూ.లక్ష పెట్టుబడి పెట్టాను. ఈ రోజు నాలుగు బస్తాలను మార్కెట్‌కు తీసుకొచ్చాను. షావుకారులు క్వింటాల్ రూ.15,500 ధర పెట్టారు. పెంచమని ఎంత వేడుకొన్నా ధర పెట్టలేదు. ఏమి చేయలేక పంటను అమ్మాను. అటు పంటకు రోగం వచ్చి ఆగమయ్యింది. ఇటు మార్కెట్లో ధర లేదు. చాలా బాధగా ఉంది. ఏమి చేయాలో అర్థంకావడం లేదు. **– భూక్యా సోమ్లా, రైతు, ఎల్లంపేట, మరిపెడ(బంగ్లా)**




# లోక్‌సభ ఎన్నికలకు సన్నద్ధం

## నేడు హైదరాబాద్‌కు గులాబీ సేన

- **తెలంగాణ భవన్‌లో ఖమ్మం పార్లమెంటరీ నియోజకవర్గ స్థాయి సమావేశం**
- **విజయమే లక్ష్యంగా బీఆర్ఎస్ అధిష్ఠానం ప్రణాళికలు**
- **దిశానిర్దేశం చేయనున్న పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్**
- **హాజరుకానున్న మాజీ మంత్రి అజయ్, ఎంపీలు, ప్రజాప్రతినిధులు, నాయకులు**



ఖమ్మం, జనవరి 8 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): రానున్న లోక్‌సభ ఎన్నికలకు బీఆర్ఎస్ సమరశంఖం పూరిస్తున్నది.. అసెంబ్లీ ఎన్నికల సమయంలో జరిగిన లోటుపాట్లను అధిగమించి.. సమష్టిగా పనిచేసి విజయఢంకా మోగించేందుకు సిద్ధమవుతున్నది. ఈ మేరకు పార్టీ కార్య నిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ రాష్ట్రవ్యాప్తంగా లోక్‌సభా స్థానాలకు చెందిన పార్టీ శ్రేణులతో సన్నాహక సమావేశాలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మంగళవారం ఖమ్మం పార్లమెంటరీ నియోజకవర్గస్థాయి సన్నాహక సమావేశం జరుగనున్నది. ఉమ్మడి జిల్లాలో మొత్తం పది శాసనసభ స్థానాలు ఉండగా ఖమ్మం పార్లమెంటరీ నియోజకవర్గంలో ఖమ్మం, పాలేరు, వైరా, మధిర, సత్తుపల్లి, అశ్వారావుపేట, కొత్తగూడెం అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. మహబూబాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గంలో భద్రాచలం, పినపాక, ఇల్లెందు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి.




**హాజరయ్యేది వీరే..**

ఖమ్మం పార్లమెంటరీ నియోజకవర్గ సమావేశానికి ఉమ్మడి జిల్లాలోని పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలోని ఏడు శాసనసభ నియోజకవర్గాల ఇన్‌చార్జులు, ఉభయ జిల్లాల పార్టీ అధ్యక్షులతోపాటు మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎంపీ నామా నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యులు బండి పార్థసారథిరెడ్డి, వద్దిరాజు రవిచంద్ర, ఉభయ జిల్లాల జిల్లా పరిషత్‌చైర్మన్లు లింగాల కమల్‌రాజు, కంచర్ల చంద్రశేఖర్‌రావు, మాజీ శాసన సభ్యులు కందాళ ఉపేందర్‌రెడ్డి, సండ్ర వెంకటవీరయ్య, రాములునాయక్, బానోతు మదన్‌లాల్, మెచ్చా నాగేశ్వరరావు, వనమా వెంకటేశ్వరరావు పాల్గొననున్నారు. మహబూబాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గ సమావేశం ఈ నెల 11న హైదరాబాద్‌లోనే జరుగనున్నది.

**ఎంపీ, సహకార, స్థానిక సంస్థల ఎన్నికల్లో గులాబీదే హవా..**

ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని ఖమ్మం, పాలేరు, వైరా, మధిర, సత్తుపల్లి, అశ్వారావుపేట, కొత్తగూడెం అసెంబ్లీ నియోజకవర్గాల్లో గత శాసనసభ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమిపై అధిష్ఠానం సమీక్షించనున్నది. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 100 మంది చొప్పున సుమారు 700 మంది సమావేశానికి హాజరు కానున్నారు. వీరిలో ముఖ్య నేతలు, నాయకులు, ప్రజాప్రతినిధుల నుంచి ద్వితీయశ్రేణి నాయకులు ఉంటారు.

2019 అసెంబ్లీ ఎన్నికల్లో ఖమ్మం లోక్‌సభ స్థానాన్ని బీఆర్ఎస్ కైవసం చేసుకున్నది. కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి రేణుకా చౌదరిపై నామా నాగేశ్వరరావు అత్యధిక మెజార్టీతో గెలుపొంది విజయ బావుటా ఎగురవేశారు. అలాగే ఆ తర్వాత జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలు, సహకార సంఘాల ఎన్నికల్లోనూ గులాబీదే పైచేయి.

**అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపై సమీక్ష..**

ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో పార్టీకి చేదు ఫలితాలు ఎదురయ్యాయి. అయినా పార్టీ కేడర్ మాత్రం చెక్కు చెదరలేదు. అదే విధంగా ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోనూ ఏ పార్టీకి లేనంత బలమైన కేడర్ ఒక్క బీఆర్ఎస్‌కే ఉంది. పార్టీ శ్రేణుల్లో నెలకొన్న నిరాశ, నిస్పృహలను తొలగించేలా బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కల్వకుంట్ల తారకరామారావు నూతనోత్సాహాన్ని నింపనున్నారు. గత ఎన్నికల్లో లభించిన ఫలితాలను బేరీజు వేసుకుని ఈసారి లోక్‌సభల్లో అనుసరించాల్సిన విధానాలపై దిశానిర్దేశం చేయనున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు, పార్టీ శ్రేణులను కార్యోన్ముఖులను చేసే విధంగా ఆయన ప్రసంగం సాగనున్నది.

## ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలి

**కలెక్టర్ వీపీ గౌతమ్**



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ వీపీ గౌతమ్

మామిళ్లగూడెం, జనవరి 8 : ప్రజా సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు చేపట్టాలని కలెక్టర్ వీపీ గౌతమ్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్ డేలో ప్రజల నుంచి సమస్యల దరఖాస్తులను స్వీకరించారు. సత్తుపల్లి మండలం బేతుపల్లికి చెందిన గుడిమెట్ల కన్యాకుమారి, చింతకాని మండలం పాతర్లపాడుకు చెందిన మార్కపూడి నాగేశ్వరరావు, కల్లూరు మండలం రఘునాథగూడేనికి చెందిన మారీదు సీతారామమ్మ భూ సమస్యలకు కలెక్టర్ సత్వరమే పరిష్కారం చూపి ఉత్తర్వు ప్రతులను జారీ చేశారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల దరఖాస్తులు స్వీకరించి ఆయా సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ శిక్షణ కలెక్టర్ మయాంక్‌సింగ్, అదనపు కలెక్టర్ డి.మధుసూదన్‌నాయక్, ఆర్డీవో గణేశ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## సీపీ విష్ణు వారియర్‌కు వీడ్కోలు

**ఘనంగా సన్మానించిన అధికారులు, సిబ్బంది**



బదిలీపై వెళ్తున్న సీపీ దంపతులను సన్మానిస్తున్న పోలీస్ అధికారులు

మామిళ్లగూడెం, జనవరి 8 : బదిలీపై కేంద్ర సర్వీసులకు వెళ్తున్న పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్ వారియర్‌కు ఖమ్మం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఆత్మీయ వీడ్కోలు పలికారు. నగరంలోని కేఎల్‌సీలో జరిగిన కార్యక్రమంలో జిల్లాలోని ఏసీపీలు, సీఐలు, ఎస్సైలు, మినిస్టీరియల్ స్టాఫ్, పోలీసు సిబ్బంది హాజరై ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు పోలీస్ అధికారులు మాట్లాడుతూ జిల్లా పోలీస్ యంత్రాంగాన్ని ఎప్పటికప్పుడు సమన్వయం చేస్తూ.. విధి నిర్వహణలోవిజయవంతంగా ముందుకు నడిపించిన జిల్లా పోలీస్ అధికారి బదిలీ కావడం కొంత బాధగానే ఉందన్నారు. కీలకమైన కేంద్ర సర్వీస్ విభాగానికి వెళ్తున్న ఆయన మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. బదిలీపై వెళ్తున్న సీపీ విష్ణు మాట్లాడుతూ జిల్లా అధికారులు, సిబ్బంది తనపై చూపిన అభిమానానికి కృతజ్ఞతలు తెలిపారు. నూతన పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆధ్వర్యంలో పోలీస్ యంత్రాంగం మరింత సమర్థంగా పని చేయాలన్నారు. మరో రెండు రోజుల్లో కేంద్ర సర్వీస్‌లోని కీలక విభాగంలో బాధ్యతలు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమం అనంతరం పూల వర్షం కురిపిస్తూ పోలీస్ సిబ్బంది తమ అభిమానాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ ప్రసాద్‌రావు, ఏసీపీలు గణేశ్, హరికృష్ణ, ప్రసన్నకుమార్, బస్వారెడ్డి, రెహమాన్, రామనుజం, శివరామయ్య, రవి, నర్సయ్య, సుశీల్‌సింగ్, ఆర్ఐలు, సీఐలు, ఎస్ఐలు, సెక్షన్ సూపరింటెండెంట్ జానకీరాం తదితరులు పాల్గొన్నారు.

## రామయ్య సన్నిధిలో ఎండోమెంట్ కమిషనర్

భద్రాచలం, జనవరి 8 : భద్రాచలం సీతారామచంద్రస్వామిని దేవాదాయ, ధర్మాదాయ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్, ఎండోమెంట్ ఎస్ఈ మల్లికార్జునరెడ్డి దర్శించుకున్నారు. సోమవారం ఆలయానికి చేరుకున్న వారికి ఈవో, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ముందుగా ధ్వజస్తంభం వద్ద నమస్కరించుకొని అంతరాలయంలోని మూలవరుల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమ్మవారి సన్నిధిలో ఆలయ ప్రధానార్చకులు అమరవాది విజయరాఘవన్, పొడిచేటి సీతారామానుజాచార్యులు వారికి వేదాశీర్వచనం, స్వామి వారి ప్రసాదాలు, శేష వస్త్రాలు అందజేశారు. కార్యక్రమంలో దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి, ఆస్థాన స్థానాచార్యులు కేఈ స్థలశాయి, ఈఈ రవీందర్ రాజు, ఏఈవో భవానీ రామకృష్ణ, వేద పండితులు లింగాల ప్రసాద్ శర్మ, ఉప ప్రధాన, ముఖ్య అర్చకులు పాల్గొన్నారు.

# అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

**ప్రజావాణిలో కలెక్టర్ ప్రియాంక ఆల**



ప్రజావాణిలో విజ్ఞప్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రియాంక ఆల

భద్రాద్రి కొత్తగూడెం, జనవరి 8 (నమస్తే తెలంగాణ) : అపరిష్కృత సమస్యలపై ప్రజలు ఇచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ప్రియాంక ఆల అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడీవోసీ సమావేశ మందిరంలో అన్ని శాఖల అధికారులతో ప్రజావాణి నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల దరఖాస్తులను స్వీకరించి.. వాటిని పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులకు ఎండార్స్ చేశారు. సారపాకకు చెందిన పూజారి శ్రీదేవి.. కాంట్రాక్టు పద్ధతిలో కుక్ పోస్టు ఇప్పించాలని, టేకులపల్లి మండలం శంభునిగూడెంకు చెందిన సనపా కృష్ణవేణి.. తన నియామకాన్ని నిలిపివేయకుండా అంగన్‌వాడీ టీచర్‌గా ఉత్తర్వులు ఇవ్వాలని వినతిపత్రం సమర్పించారు. అశ్వారావుపేట మండలం బబ్బువారిగూడెంకు చెందిన కట్టం అర్జమ్మ, భర్త భీమయ్యకు పోడు పట్టాదారు పాస్ పుస్తకంలో తప్పు దొర్లిందని, దానిని సరిచేసి ఇవ్వాలని కోరారు. ఇల్లెందు మండలం సుభాష్‌నగర్‌కు చెందిన అన్నపూర్ణ తాను కోయ కులానికి చెందిన దానినని, ఏజెన్సీ ప్రాంతంలో భవన నిర్మాణం చేసుకుంటుంటే కొందరు తప్పుడు కథనాలు రాశారని, వారిపై చర్య తీసుకోవాలని కలెక్టర్‌ను కోరగా.. తగు చర్యల నిమిత్తం ఆమె అర్జీని డీపీఆర్‌వోకు, కొత్తగూడెం ఆర్డీవోకు ఎండార్స్ చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు రాంబాబు, మధుసూదన్‌రాజు, డీఆర్‌వో రవీంద్రనాథ్, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

**గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు చేయాలి**

కొత్తగూడెం టౌన్, జనవరి 8 : గణతంత్ర దినోత్సవ వేడుకల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడీవోసీ కార్యాలయ సమావేశ మందిరంలో గణతంత్ర దినోత్సవ వేడుకల నిర్వహణకు ఏర్పాట్లు, ప్రజాపాలన అభయహస్తం దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ తదితర అంశాలపై అన్ని శాఖల జిల్లా అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరేడ్, మార్చ్‌ఫాస్ట్, పోలీస్ గౌరవ వందనం నిర్వహణ కార్యక్రమాలను పర్యవేక్షించాలని పోలీస్ అధికారులకు సూచించారు.

అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రజలనుద్దేశించి ప్రసంగించేందుకు అన్ని శాఖల అధికారులు డీపీఆర్‌వోకు ప్రగతి నివేదికలు అందజేయాలని, అసెట్స్ పంపిణీ, స్టాళ్లు ఏర్పాటు చేయాలని డీఆర్‌డీవోకు సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు రాంబాబు, మధుసూదన్‌రాజు, డీఆర్‌వో రవీంద్రనాథ్, అన్ని శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నేత్రపర్వంగా విశ్వరూప సేవ

**సర్వ దేవతలకు ఒకే వేదికపై పూజలు**

**అద్భుతమైన సేవను తిలకించిన భక్తులు**






రామాలయంలో విశ్వరూప సేవ నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం, జనవరి 8 : భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవాలయంలో విశ్వరూప సేవను సోమవారం నేత్రపర్వంగా నిర్వహించారు. ఆలయంలోని సర్వ దేవతలను ఒకే వేదికపైకి వేంచేపు చేసి ప్రత్యేక పూజలు చేశారు. ఓ వైపు ధూప, దీపాలు, మరో వైపు ఆస్థాన హరిదాసులు ఆలపిస్తున్న కీర్తనలతో ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. వైకుంఠ ఏకాదశి(ముక్కోటి ఏకాదశి) తర్వాత వచ్చే బహుళ ద్వాదశి రోజున ఉత్సవమూర్తులందరినీ ఒకే వేదికపై వేంచేపు చేసి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఈ విశేష సేవ ఒక్క భద్రాచలం రామాలయంలోనే చేపడతారు. అద్భుతమైన ఈ సేవను తిలకిస్తే సమస్త దేవతల దర్శనం లభించినట్లే. ఆలయ ప్రాంగణంలో ఉన్న 108 దేవతామూర్తులను(ఆళ్వార్లతో సహా) ఒకే వేదికపై ఆశీనులను చేసి ప్రత్యేక అలంకరణలు చేయడంతో అల వైకుంఠం.. ఇల వైకుంఠంగా మారిపోయింది. గరుడ వాహనంపై శ్రీరామచంద్రమూర్తిని వేంచేపు చేసి చుట్టూ ఉత్సవమూర్తులను వేంచేపు చేసి ఆరాధనలు చేసి వివిధ రకాల కూరగాయలతో తయారు చేసిన కదంబం అనే ప్రసాదాన్ని నివేదించారు. అనంతరం ఆలయానికి విచ్చేసిన భక్తులకు కదంబ ప్రసాదాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి, ఆస్థాన స్థానాచార్యులు కేఈ స్థలశాయి, ఏఈవోలు భవానీ రామకృష్ణ, ఆలయ ప్రధానార్చకులు పొడిచేటి సీతారామానుజాచార్యులు, అమరవాది విజయరాఘవన్, ఉప ప్రధాన, ముఖ్య అర్చకులు, పరిచారకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## హైవే నిర్మాణాల్లో వేగం పెంచాలి

**రహదారులకు భూములిచ్చే రైతుల త్యాగాలను గుర్తించాలి**

**పరిహారం ఎక్కువగా చెల్లించేలా చూడాలి : మంత్రి తుమ్మల**



ఆర్అండ్‌బీ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి తుమ్మల

ఖమ్మం, జనవరి 8 : జాతీయ రహదారుల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆర్అండ్‌బీ అధికారులను ఆదేశించారు. ఖమ్మం జిల్లాలో నిర్మిస్తున్న జాతీయ రహదారుల పనుల పురోగతి, రైతులకు అందించే పరిహారంపై సోమవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఆర్అండ్‌బీ అధికారులతో మంత్రి సమీక్షించారు. ఖమ్మం-దేవరపల్లి గ్రీన్ ఫీల్డ్ హైవే, అమరావతి-నాగ్‌పూర్ గ్రీన్ ఫీల్డ్ జాతీయ రహదారి పనుల పురోగతిపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల.. ఖమ్మం-దేవరపల్లి గ్రీన్ ఫీల్డ్ హైవేకు సంబంధించి ఖమ్మం జిల్లాలోని తెలంగాణ రాష్ట్ర సరిహద్దు వరకు ఎంట్రీ, ఎగ్జిట్ పాస్‌ల నిర్మాణం ఎక్కడెక్కడ చేపడుతున్నారన్న వివరాలు అడిగి తెలుసుకున్నారు. విజయవాడ-జగదల్‌పూర్ హైవే వద్ద గ్రీన్ ఫీల్డ్ హైవేకు ప్రవేశ, ముగింపు ద్వారాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఫలితంగా సత్తుపల్లి ప్రజలతోపాటు నూజివీడు, తిరువూరు ప్రాంతవాసులకు రవాణా సౌకర్యం సౌలభ్యంగా ఉంటుందన్నారు. అమరావతి-నాగ్‌పూర్ గ్రీన్ ఫీల్డ్ హైవేకు సంబంధించిన అలైన్‌మెంట్‌ను పునఃపరిశీలించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో భూములు కోల్పోయిన రైతులకు మార్కెట్ ధరకు అనుగుణంగా పరిహారం చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఖమ్మం నియోజకవర్గంతోపాటు పరిసర ప్రాంతాల్లో జాతీయ రహదారి కోసం కొత్తగా చేపట్టే భూ సేకరణలో నిర్వాసితులకు ఎక్కడా అన్యాయం జరగకుండా చూడాలన్నారు. నిర్వాసితులకు మార్కెట్ రేటు కన్నా పరిహారం ఎక్కువగా చెల్లించేలా చూడాలన్నారు. ఖమ్మం-దేవరపల్లి గ్రీన్ ఫీల్డ్ హైవేలో ఖమ్మం నియోజకవర్గ పరిధిలో అవసరమైన అన్ని ప్రాంతాల్లో సర్వీసు రోడ్లు, అండర్ పాస్‌లు ఏర్పాటు చేయాలన్నారు. గ్రీన్ ఫీల్డ్ రహదారికి భూములు ఇచ్చిన రైతులతోపాటు రహదారి పక్కన సాగు చేసుకునే రైతాంగానికి భవిష్యత్తులో ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని మంత్రి తుమ్మల దిశానిర్దేశం చేశారు. సమావేశంలో ఆర్అండ్‌బీ సెక్రటరీ శ్రీనివాసరాజుతోపాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

## తగ్గిన పాలేరు నీటిమట్టం

- **15.30 అడుగులకు చేరిన నీరు**
- **ఈ నెల చివరి వరకు సరిపోయే పరిస్థితి**

కూసుమంచి, జనవరి 8 : పాలేరు రిజర్వాయర్‌లో నీటిమట్టం క్రమక్రమంగా తగ్గుతూ 15.30 అడుగులకు చేరింది. ప్రస్తుతం ఉన్న నీరు మిషన్ భగీరథ తాగునీటికి రోజూ 125 క్యూసెక్కుల చొప్పున విడుదల చేస్తే.. జనవరి చివరి వరకు మాత్రమే సరిపోయే పరిస్థితి ఉన్నది. సాగర్ నీరు రాకపోవడంతో ఈసారి యాసంగికి సాగునీరు విడుదల లేకపోవడంతోపాటు సాగర్ డ్యాంలో నీటిమట్టం పూర్తిగా తగ్గింది. దీంతో పాలేరుకు నవంబర్ తర్వాత నీటి ఇన్‌ఫ్లో లేకుండా పోయింది. అయితే పాలేరు కింద మిషన్ భగీరథ ద్వారా ఖమ్మం, ఉమ్మడి వరంగల్ జిల్లా, సూర్యాపేట జిల్లాలోని మూడు నియోజకవర్గాలకు తాగునీటిని అందిస్తున్నారు. దీనికి ప్రత్యామ్నాయంగా సాగర్ నుంచి ఎడమ కాలువ ద్వారా కనీసం వారం రోజులపాటు 3,500 నుంచి 4 వేల క్యూసెక్కుల నీటిని పాలేరుకు వచ్చేలా చేయగలిగితే తాగునీటికి ఇబ్బంది లేకుండా ఉంటుంది. అయితే దీనిపై ఉన్నత స్థాయి సమీక్ష జరిపిన మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, నీటిపారుదల శాఖ అధికారులు తాగునీటి అవసరాలు, పరిస్థితులను పరిశీలించి ఒకటి రెండు రోజుల్లో సాగర్ నుంచి ప్రత్యేకంగా నీటిని విడుదల చేసే అవకాశం ఉన్నది.

-మిగతా వార్తలు 8వ పేజీలో..